క్లుప్తంగా

సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన కనీస వేతనం, పర్మనెంట్ సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ అన్నారు. పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు, మల్టీ పర్పస్ విధానం రద్దు తదితర డిమాండ్ల సాధనకు గురువారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పోషణ మాసం డబ్బులు చెల్లించండి..
రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పోషణ మాసం డబ్బులు చెల్లించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.పద్మ అన్నారు. గురువారం ఐసీడీఎస్ ఆఫీస్ సిబ్బంది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. పద్మ మాట్లాడుతూ.. రెండేళ్లుగా పోషణ మాసం డబ్బులు చెల్లించకుండా పోషణ కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డ రవికుమార్, సహాయ కార్యదర్శి కే.సత్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు విరాళాలు సమర్పిస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తగూడెంలోని ప్రగతినగర్‌కు చెందిన జగదీశ్వర్ – ప్రత్యూష గురువారం రూ.9,116 విరాళం అందజేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: అనారోగ్యంతో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ కుటుంబానికి గురువారం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ చెక్కు అందజేశారు. గత అక్టోబర్‌లో మరణించిన కిరణ్‌కుమార్ కుటుంబ సభ్యులు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్‌రాజ్‌ను కలిశారు. కిరణ్‌కుమార్‌కు ఎక్స్‌గ్రేషియా కింద రూ.8.60 లక్షల చెక్కును అందజేశారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి..

ఇల్లెందు: వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుని పట్టణ ప్రజల దాహార్తిని తీర్చాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన అధికారులతో మంచినీటి ఎద్దడి, నివారణపై సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మిషన్ భగీరథ పైపులైన్ పనులు పూర్తయ్యాయని, అన్ని వాటర్ ట్యాంకులకు మంచినీటిని అందిస్తున్నామన్నారు. పట్టణంలో 80 మంచినీటి చేతి పంపులు, బోర్లు ఉన్నాయని, ఇందులో 45 వరకు సక్రమంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో కమిషనర్ యాదగిరి, మేనేజర్ అంకుషావలీ, డీఈ నవీన్, ఏఈ కుమారస్వామి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పీఓలకు సన్మానం



అధికారులను సన్మానిస్తున్న నాయకులు

టేకులపల్లి: కోయగూడెం ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎస్‌వీఆర్ ప్రహ్లాద్ సత్తుపల్లికి బదిలీ కాగా, కొత్తగూడెం ఏరియా నుంచి వి.శ్రీనివాస్‌రావు నూతన పీఓగా వచ్చారు. గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కేఓసీలో వీరిద్దరిని ఘనంగా సన్మానించగా.. పలువురు మాట్లాడారు. కేఓసీ అభివృద్ధి, లక్ష్యసాధనకు కృషి చేసిన ప్రహ్లాద్ సేవలు మరువలేనివని పేర్కొన్నారు. అలాగే, కొత్త పీఓ శ్రీనివాసరావు కేఓసీ–3 సింగరేణికే దిక్సూచిలా కృషి చేయాలని కోరారు. ఐఎన్‌టీయూసీ పిట్ కార్యదర్శి రాకం అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గని మేనేజర్ సౌరభ్ సుమన్, అధికారులు సత్యనారాయణరాజు, మధుసూదన్, ఉండేటి బ్రహ్మం, భూక్యా నాగేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం..

- గ్రామస్తుల సహకారంతో పోలారంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం
- రైతులకు తీరనున్న ఓవర్‌లోడ్ సమస్య
- నాలుగు ఫీడర్ల ద్వారా సరఫరా



పోలారంలో ప్రారంభం కానున్న విద్యుత్ సబ్‌స్టేషన్

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఏజెన్సీలో ప్రస్తుతం కొమరారం, మాణిక్యారం విద్యుత్ సబ్‌స్టేషన్ల ద్వారా గృహ, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరా జరుగుతోంది. కొమరారం సబ్‌స్టేషన్‌కు ఓవర్‌లోడ్ సమస్య ఎదురు కావడంతో అదనంగా పోలారంలో మరో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనికోసం ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరైన వెంటనే పనులు వేగవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం పోలారం విద్యుత్ సబ్‌స్టేషన్ అన్ని పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

సమష్టి కృషితో నెరవేరిన కల...
ఉచిత కరెంటు ప్రారంభమైన నాటి నుంచి ఏటా వానాకాలంతోపాటు యాసంగిలోనూ కొమరారం సబ్‌స్టేషన్ ఓవర్‌లోడ్ సమస్య ఎదుర్కొంటోంది. ఒక దశలో పంటలు ఎండిపోతున్న దశలో రైతులు ట్రాన్స్‌కో అధికారులపై ఒత్తిడి తెచ్చారు. తక్షణం ప్రత్యామ్నాయం చూపి రైతులను ఆదుకోవాలని ఆందోళనల ద్వారా వేడుకున్నారు. దీంతో అధికారులు సమీపంలోని కాచనపల్లి ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేపట్టి పంటలు ఎండిపోకుండా రైతులను ఆదుకున్నారు. ఇదే సమస్య ఏటా ఎదురుకావడంతో శాశ్వత పరిష్కారంగా పోలారం కేంద్రంగా మరో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ వాంకుడోత్ సరోజిని నియోజకవర్గ, జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించుకున్నారు. అయితే సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం అవసరమైన స్థలం అందుబాటులో లేకపోవడంతో మాజీ సర్పంచ్ సరోజిని చొరవ తీసుకొని రైతులతో సమావేశం ఏర్పాటు చేసి రూ.15లక్షలు ఇచ్చేలా రైతులను ఒప్పించి ఎకరం స్థలం కొనుగోలు చేసి ట్రాన్స్‌కో అధికారులకు సకాలంలో అప్పగించారు. దీంతో అధికారులు సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పూర్తి చేశారు.

ఓవర్ లోడ్ సమస్యకు పరిష్కారం..
పోలారం సబ్‌స్టేషన్ పరిధిలో ఉండే పోలారం, మర్రిగూడెం గ్రామపంచాయతీలలో ప్రస్తుతం మూడు వేల వరకు గృహ విద్యుత్ కనెక్షన్లు, 742 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటి వరకు కొమరారం సబ్‌స్టేషన్ ద్వారా పోలారం, మర్రిగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతోంది. అయితే ఈ ప్రాంత రైతులు అత్యధికులు బోర్లు, బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తుండటంతో విద్యుత్ వినియోగం పెరిగింది. దీంతో లోడు ఎక్కువై తరచూ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండేవి. సమస్యకు శాశ్వత పరిష్కారంగా పోలారంలో కొత్తగా 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు.

నిర్మాణంలో గ్రామస్తుల భాగస్వామ్యం...
పోలారంలో 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం గ్రామస్తులు రూ.15.20 లక్షలు వెచ్చించి ఎకరం భూమిని కొనుగోలు చేసి ట్రాన్స్‌కో అధికారులకు అప్పగించారు. వెంటనే పనులు ప్రారంభించిన అధికారులు రూ.70 లక్షల వ్యయంతో 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్, ఒక్కోటి రూ.3లక్షల వ్యయంతో నాలుగు బ్రేకర్లు, రూ.10లక్షల వ్యయంతో 9 కి.మీ పొడవున విద్యుత్తు లైన్ లాంటి ప్రధాన వ్యయాలతో మొత్తంగా నిర్మాణం కోసం రూ.1.30 కోట్లు వెచ్చించారు.

నాలుగు ఫీడర్ల ఏర్పాటు...
పోలారం 33/11 కె.వి సబ్‌స్టేషన్ ద్వారా పోలారం, మర్రిగూడెం గ్రామపంచాయతీల పరిధిలో వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయనున్నారు. దీనికోసం సబ్‌స్టేషన్ నుంచి నాలుగు భాగాలుగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. గృహ వినియోగానికి పోలారం ఫీడర్, వ్యవసాయ విద్యుత్ వినియోగానికి పోలారం–2 ఫీడర్, మర్రిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరా కోసం మర్రిగూడెం ఫీడర్, సీత్లాతండా ఫీడర్ పేరుతో వ్యవసాయ వినియోగానికి నాలుగు ఫీడర్లను సబ్‌స్టేషన్‌కు అనుసంధానించారు.

సమష్టి కృషితో నిర్మాణం...



గ్రామస్తుల సహకారం, అన్ని రాజకీయ పక్షాల తోడ్పాటుతో పోలారానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయించుకున్నాం. స్థలాన్ని రైతుల సహకారంతో రూ.15.20 లక్షల వ్యయంతో కొనుగోలు చేసి అధికారులకు అప్పగించాం. ఇప్పటి వరకు రూ.10.50 లక్షలు భూమి విక్రయించిన రైతుకు ఇచ్చాం. రెండు రోజుల్లో మిగతా సొమ్ము కూడా అందజేస్తాం.
– వాంకుడోత్ సరోజిని, మాజీ సర్పంచ్, పోలారం

త్వరలో అందుబాటులోకి తెస్తాం..



రైతుల విద్యుత్ అవసరాలను గుర్తించి పోలారంలో 33/11 కె.వి సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేశాం. అడిగిన వెంటనే రైతులు భూమిని కొనుగోలు చేసి అప్పగించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సిబ్బంది నియామకం ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేసి ప్రారంభోత్సవ కార్యక్రమం ద్వారా సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తాం.
– కోటేశ్వరరావు, ఏడీఈ, ట్రాన్స్‌కో, ఇల్లెందు సబ్‌డివిజన్

ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి

ఇల్లెందు: మానవ శరీరంలో అత్యంత కీలకమైన భాగం మూత్రపిండాలని, వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌లో వరల్డ్ కిడ్నీ డే నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జీవన శైలికి ఆహారపు అలవాట్లలో కూడా మార్పు చేసుకోవాలన్నారు. ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. మానవ శరీరంలో అతి ముఖ్యమైనవి మూత్ర పిండాలు, శరీరంలోని వ్యర్థాలను తొలగిస్తాయని వాటిపైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. ఈ అవయవాల ప్రాధాన్యతను తెలియజేసే ఉద్దేశ్యంతోనే ప్రపంచమంతటా ప్రతీ ఏటా వరల్డ్ కిడ్నీ డే నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డాక్టర్లు బన్సీలాల్, లెనిన్, ఏజీపీ సుధాకర్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్ తదితరులు

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ...
టేకులపల్లి: తొమ్మిదోమైలు తండా, దాసుతండా గ్రామపంచాయతీల్లో గురువారం 84 మంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బానోతు పూర్ణ, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ రవీంద్రరావు, కార్యదర్శి శరత్, పోశాలు పాల్గొన్నారు.

ఇసుక నిల్వలు సీజ్

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: ఏజెన్సీలో మట్టి, ఇసుక మాఫీయా చెలరేగిపోతోంది. ఈ క్రమంలో 'తెగ తోడేస్తున్నారు' శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తా కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు తోగ్గూడెం గ్రామాన్ని ఆనుకుని రహస్య ప్రదేశాల్లో నిల్వ చేసిన మూడు లారీల లోడ్ల ఇసుకను గురువారం తహసీల్దార్ వివేక్ ఆదేశాల మేరకు రూరల్ ఆర్ఐ హచ్యా సంఘటన స్థలానికి వెళ్లి సీజ్ చేశారు. ఇసుకను లారీల్లో ఎత్తించి తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు ఆర్ఐ తెలిపారు.

కేసు నమోదు

పాల్వంచ: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తీసుకెళ్తున్న ఆటో డ్రైవర్‌పై పాల్వంచ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 12న ట్రాలీ ఆటోలో 10 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా అల్లూరి సెంటర్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సివిల్ సప్లై అధికారుల తనిఖీల్లో రేషన్ బియ్యంగా నిర్ధారణ కావడంతో ఆటో డ్రైవర్ సిరికొండ నగేష్‌పై గురువారం కేసు నమోదు చేశారు.

క్రికెట్ టోర్నీలో ప్రతిభ

పాల్వంచ: భూపాలపల్లి జిల్లా చెల్పూరు కేటీపీపీలో ఇటీవల నిర్వహించిన క్రికెట్ టోర్నీలో కేటీపీఎస్ 5, 6 దశల జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఈ ప్రభాకర్‌రావు క్రీడాకారులను అభినందించారు.

గ్రామసభలను పరిశీలించిన ఎంపీడీఓ



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి

పాల్వంచరూరల్: మండలంలోని గ్రామపంచాయతీల్లో నిర్వహిస్తున్న 15వ విడత మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2022–2023 సామాజిక తనిఖీ గ్రామసభలను కొత్తసూరారం గ్రామంలో గురువారం ఎంపీడీఓ విజయ భాస్కర్‌రెడ్డి పరిశీలించారు.

మాట్లాడుతూ... ఉపాధి పనుల్లో కూలీలకు జరిగిన పనుల్లో అవకతవకలు ఉంటే గ్రామసభల్లో చెప్పుకోవచ్చని సూచించారు. అనంతరం నాగారం, నాగారంకాలనీ, సూరారం గ్రామాల్లోని నర్సరీలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్, అబ్జర్వర్ రవీందర్, ఏపీఓ పొరండ్ల రంగా, పంచాయతీ కార్యదర్శులు మౌనిక, బిందు, ఉపాధి హామీ సిబ్బంది లక్ష్మి, చంటి, ప్రసాద్ పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించడమే లక్ష్యం

జూలూరుపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించడమే లక్ష్యమని, ఈ దిశగా విద్యార్థులను సిద్ధం చేస్తున్నట్లు జూలూరుపాడు హైస్కూల్ హెచ్‌ఎం టి.లక్ష్మీనర్సయ్య అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 నుంచి ప్రారంభమయ్యే పబ్లిక్ పరీక్షల్లో ఎలాంటి మానసిక ఒత్తిడికి లోను కాకుండా మనోధైర్యంతో పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. ప్రణాళిక బద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని, ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. అదే విధంగా బదిలీపై వెళ్లిన టీచర్లు రమణమ్మ, ఉమామహేశ్వరి, అరుణశ్రీలను సన్మానించారు. విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, గురుమూర్తి, శాంతకుమారి, లలిత, ఉమ, రామనాథం, పటేల్, వెంకటేశ్వరరావు, కృష్ణ, పీడీ అరుణ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: విద్యార్థి దశలో పదో తరగతి భవిష్యత్‌కు పునాది లాంటిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరచారి అన్నారు. గురువారం లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. కష్టపడి చదివిన ప్రతి విద్యార్థికి భవిష్యత్ ఉంటుందన్నారు. తల్లిదండ్రుల ఆశలు నేరవేర్చాలని కోరారు. సామాజిక సేవా కార్యకర్త ఆది కోటేశ్వరరావు, హెచ్‌ఎం పి.కృష్ణయ్య, ఉపాధ్యాయులు ఎస్.చలపతిరాజు, సురేష్, అమీరుద్దీన్, సీహెచ్ నాగలక్ష్మి, వాణి, జగన్మోహిని, పద్మ, అనసూర్య, లక్ష్మి, కళ్యాణి తదితరులు ఉన్నారు.



ఇల్లెందు: హాల్ టికెట్లు అందజేస్తున్న జాన్ ఆనంద్



జూలూరుపాడు: విద్యార్థులతో హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు

ఇల్లెందు: టెన్త్ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను చాటుకోవాలని జీఎం జాన్ ఆనంద్ అన్నారు. గురువారం ఇల్లెందు జేకే సింగరేణి హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. అంతకు ముందు విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జీవీ మోహన్‌రావు, హెచ్‌ఎం టి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టుదలతో పరీక్షలకు సిద్ధం కావాలి
ఇల్లెందురూరల్: భవిష్యత్‌కు పునాది అయిన పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలని సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉమాశంకర్ అన్నారు. గురువారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడమే లక్ష్యంగా కృషి, పట్టుదలతో భవిష్యత్ చదువులను కొనసాగించాలని ఆకాంక్షించారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం..

సుజాతనగర్: ప్రతీ గ్రామానికి మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుతానని, అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశిరావు అన్నారు. గురువారం మండలంలోని సుజాతనగర్, నిమ్మలగూడెం, కొత్త అంజనాపురం, పాత అంజనాపురం, నాయకులగూడెం, రాఘవాపురం, డేగల మడుగు, సీతంపేట తదితర పంచాయతీలో రూ.1.18 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ప్రతీ గ్రామానికి రహదారి సౌకర్యం, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు, మంచి నీటి సరఫరా విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం నుంచి విడుదలవుతున్న నిధులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, తహసీల్దార్ జి.శిరీష, ఆర్ఐటీ బాబు, సర్పంచ్ బండి రమేష్, ఏఈ మల్లికార్జున్, ఎంపీఓ ఖాన్, ఏఈ శివలాల్, ఎంపీటీసీ భూక్యా దస్రు, హన్మతరావు, జక్కుల రాములు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జూలూరుపాడు: నల్లబండబోడు, సురారం గ్రామాల్లో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ గురువారం రాత్రి విస్తృతంగా పర్యటించి, రూ.3.72 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతారం–నల్లబండబోడు గ్రామాల మధ్య ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులు రూ.2.52 కోట్లు, సురారం గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు, రాళ్లబండవాగుపై రూ.70 లక్షలతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ భూమి పూజ చేశారు. మాట్లాడుతూ... వైరా నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయమన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 69 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. లేళ్ల వెంకటరెడ్డి, తహసీల్దార్ స్వాతి బిందు, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఎఫ్ఆర్ఓ ప్రసాద్‌రావు, ఎస్ఐ జీవన్‌రాజు, ఐటీడీఏ ఏఈ బీవీఎస్ ప్రసాద్, గిర్దావర్ తిరుపతిరావు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను అమలు చేయండి..

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర గిరిజన నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేష్‌నాయక్ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి శరత్‌కు వినతిపత్రం అందజేశారు. రాజేష్‌నాయక్ మాట్లాడుతూ.. 1/50, 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం తక్షణమే ట్రైబల్ అడ్వైజర్ కమిటీ తీర్మానం చేసి 100 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఆ తరువాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని తెలిపారు.



శరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్ రాథోడ్, రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత మార్కెట్ యార్డ్ నిర్మించాలి



ధర్నా నిర్వహిస్తున్న హమాలీలు, ఏఐటీయూసీ నాయకులు

జూలూరుపాడు: జూలూరుపాడులో శాశ్వత మార్కెట్ యార్డు నిర్మించాలని ఏఐటీయూసీ వైరా నియోజకవర్గ కార్యదర్శి మంకెన కృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాశ్వత మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సబ్ మార్కెట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సబ్ మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు లేక హమాలీలు, రైతులు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ప్రస్తుత సబ్ మార్కెట్‌లో షెడ్లు కూడా లేకపోవడంతో హమాలీలు ఎండలోనే భోజనం చేయాల్సిన దయనీయ స్థితి ఏర్పడిందన్నారు. హమాలీలకు లైసెన్స్ ఇవ్వాలని, ఆదివారం సెలవు ఇవ్వాలని, అదేవిధంగా ప్రమాద బీమా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా, హమాలీలు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు డీఏ విడుదల చేయండి



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులకు 2013 జూలై 1 నుంచి రావాల్సిన కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1535) సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఏ వజీర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో 1535 యూనియన్ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని ధర్నా నిర్వహించారు. వజీర్ మాట్లాడుతూ... డీఏ విడుదల కాకపోవడంతో ఉద్యోగ, కార్మికులు ఆందోళనకు గురతున్నారన్నారు. యాజమాన్యం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. సెక్రటరీ డి.రాధాకృష్ణ, ఎం.శ్రీధర్, అంబాల శ్రీను, పీవీ.సురేశ్, ఎ.వెంకటేశ్వర్లు, వి.ధనయ్య, కె.సాంబయ్య, ఎ.పుల్లారావు, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

సింగరేణి(కొత్తగూడెం): నరేంద్ర మోదీ కార్మిక, రైతుల వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరుతూ గురువారం ఎస్‌కేఎం ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరు మధు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతాంగ చట్టాలను, కార్మిక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఎస్‌కేఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈరోజు కొత్తగూడెం ఈ కార్యక్రమం చేపట్టటం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా రైతులు నెలల తరబడి ఢిల్లీని ముట్టడించి, నిరసన తెలియజేస్తే... ఆయా చట్టాలను వెనక్కి తీసుకున్న మోదీ... ఇప్పుడు మళ్లీ తెరమీదకి రావటంతో రైతాంగ ఉద్యమాలు తీవ్రతరం అయ్యాయన్నారు. రైతాంగ ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ, అరుణోదయ, పీవైఎల్ జిల్లా నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, గౌని నాగేశ్వరరావు, ఎస్కే ఉమర్, సారంగ పాణి, తోడేటి నాగేశ్వరరావు, నరాటి వెంకటేశ్వర్లు, జక్కుల రాంబాబు, పూణెం రంగయ్య, స్వర్ణపాక నాగేశ్వరరావు, కల్తి వెంకటేశ్వర్లు, రమేశ్, గుగులోత్ రామచంద్రు, చిరంజీవి, వైఎస్ రెడ్డి, లాజర్, ఎట్టి నరసింహారావు, కుంజ కృష్ణమోషన్‌రావు, సత్యనారాయణ, కిషన్, ఎర్రయ్య, సుధాకర్, జటంగి వెంకన్న, సామేలు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు